# ఇద్దరమ్మాయిలు

సాయంత్రం నాలుగవుతోంది.

కాలేజీ వదలడంతో విద్యార్థులంతా మూకుమ్మడిగా బయటపడ్డారు.

ముందు అమ్మాయిలు, వాళ్ళని అనుసరిస్తూ అబ్బాయిలు నడుస్తున్నారు. టీనేజ్ ఉత్సాహంతో ఖుషీ ఖుషీగా కబుర్లాడుకుంటూ వెళ్తున్నారంతా.

వాళ్ళలో మలయజ, నీలిమలు మిగతావాళ్ళతో కలవకుండా ఇద్దరే సరదాగా మాటాడుకుంటూ నడుస్తున్నారు.

ఆకాశమంతా మబ్బుల పందిరి వేసినట్టుంది. ఏ క్షణంలోనైనా వర్షం పడేలా వుంది. ఆ విషయం స్టూడెంట్స్ దృష్టిలో పడ్డాక వాళ్ళలో కదలిక మొదలయ్యింది. హడావుడిగా కదలిపోసాగారంతా.

ఎక్కడో ఫెళఫెళమంటూ ఉరుములు, తోడుగా మెరుపులు. వెనువెంటనే మొదలయ్యాయి చిటపట చినుకులు. ఆకాశం నోట్లోంచి రాలిపడ్డ మంచుముత్యాల్లా!

తలెత్తి చూసింది మలయజ.

వర్షం ఏక్షణంలోనైనా ఉధృతం అయ్యే సూచనలు కన్పించాయి.

"వర్షం పెరిగేట్టుంది" అంది నీలిమ వైపు చూస్తూ.

"అవునే ఇప్పుడెలా? ఇంటికి చేరేలోపు తడిచేట్టున్నాం. వెనక్కి తిరిగి మళ్లీ కాలేజిలోకి వెళ్దామా?" అడిగింది నీలిమ.

"మళ్లీ కాలేజిలోకా! అబ్బ బోర్ తల్లీ. ఓ పని చేస్తే పోలా?" అంది మలయజ.

టపటపమంటూ చినుకులు ఎక్కువయ్యాయి. వర్షం ఉధృతమయ్యింది. కాస్త దగ్గరగా జరిగి, నీలిమ చెవిలో గుసగుసలాడింది మలయజ.

"బాగుంది. వండర్‌ఫుల్ ఐడియా. వర్షం నుండి సేఫ్ కావచ్చు. టైంపాస్ కూడా అవుతుంది" ఫ్రెండ్‌ని మెచ్చుకుంది నీలిమ.

భోరున వర్షం కురవసాగింది.

ఇద్దరూ షాపింగ్ కాంప్లెక్స్ వైపు వడివడిగా కదిలారు. కాలేజికి దగ్గర్లోనే వుంటుందది. దగ్గరకు వచ్చేసారు కూడా.

గబగబా 'వనిత సిల్క్స్ అండ్ కాటన్స్' అని బోర్డున్న షాపులోకి అడుగుపెట్టారు.

సేల్స్‌బోయ్ మందహాసం చిందిస్తూ ఆ ఇద్దరమ్మాయిల్ని సాదరంగా లోపలికి ఆహ్వానించాడు.

"మీకేం కావాలో చెప్పండి?" వినయంగా అడిగాడు చిరుగడ్డం వున్న ఓ సీనియర్ సేల్స్‌బోయ్.

"సల్వార్ సూట్స్ చూపండి" బదులిచ్చింది మలయజ.

"మీకు ఏ టైప్ కావాలో చెబితే..." చాలా ప్లీజెంట్‌గా అడిగాడతను.

"న్యూ మోడల్స్ చూపండి" అంది నీలిమ.

వినయంగా తలూపుతూ, షెల్ఫ్‌లోంచి ఓ నాలుగైదు జతల సిల్క్ పాకెట్స్ వాళ్ల ముందుంచాడు.

"ఈ డ్రెసెస్ పై వున్న ప్రింట్‌కి తగినట్టుగా ఎంబ్రాయిడరీ వుంది. చాలా బాగున్నాయి చూడండి" అన్నాడు ఓ పాకెట్ లోంచి డ్రెస్ తీసి, మడత విప్పి వాళ్లకి చూపిస్తూ.

దాన్ని అటూ ఇటూ తిరగేసారిద్దరు. నచ్చనట్లు మొహం చిట్లించారు.

అది గమనించి, "ముందు డ్రెస్ సెలక్షన్ ఎవరికో చెప్పండి. సరైన మ్యాచింగ్ చెబుతా" అన్నాడా గెడ్డం సేల్స్‌బోయ్.

"ఇద్దరికీ" ఒకేసారి అన్నారిద్దరు.

అతను తల పంకించి, వాటిలోంచి మరొక డ్రెస్ తీసి, "ఈ అమ్మాయికి బాగుంటుందీ మోడల్" నీలిమని చూపిస్తూ అన్నాడు.

వెంటనే "బాగోలేదు" అంటూ పెదవి విరిచేసిందా అమ్మాయి.

వాటిని పక్కన నెట్టేసి మరో ట్రైపుని కొన్ని పీసెస్ వాళ్ళ ముందుంచుతూ "ఇవి సాదా కాటన్‌వండి. అయినా ఎంబ్రాయిడరీ చేసినందువల్ల క్లాసిక్‌గా వుంటాయి" అన్నాడు. ముభావంగా చూసారిద్దరు.

ఆ డ్రెస్ మలయజ కళ్లని ఆకర్షించడం ఆ సేల్స్‌బోయ్ దృష్టిని దాటిపోలేదు. ఈ డ్రెస్ సెలక్షన్ ఖాయం అనుకున్నాడు.

"మీకీ డ్రెస్ సూటవుతుంది. హుందాగా వుంటుంది" అన్నాడు పొగిడేస్తూ.

నిజమేన్పించింది మలయజకి. కలర్స్ బావున్నాయి కూడా.

సడెన్‌గా వర్షం తగ్గుముఖం పట్టింది. ఆ విషయాన్ని నీలిమ మలయజ చెవిలో వేసింది.

మలయజ ఓసారి బయటికి చూపు సారించి, మళ్లీ ఇటు తిరిగి "ఎందుకనో మాకేవి నచ్చడం లేదండి. వెరైటీ డ్రెసెస్ వచ్చినప్పుడు ఇన్‌ఫామ్ చేయండి" అంది.

"ఫర్వాలేదు. వారం పదిరోజుల్లో లేటెస్ట్ మోడల్స్ వస్తాయి. మీ అడ్రస్‌లు ఇవ్వండి. తప్పక తెలియజేస్తాం" అన్నాడు వెంటనే.

గతుక్కుమన్నారు ఇద్దరు. చేసేదేం లేక చిరునామాలు చెప్పి బ్రతుకు జీవుడా అనుకుంటూ బయట పడ్డారా షోరూం నుండి.

***

జనం సంచారం యధావిధిగా మొదలయ్యింది. రోడ్డంతా జలమయం.

బురద చిల్లకుండా నెమ్మదిగా నడుస్తున్నారా ఇద్దరమ్మాయిలు.

ఇంతలో రయ్‌మంటూ స్పీడ్‌గా ఓ లూనా వాళ్ల పక్కనుండే దూసుకు వెళ్లింది.

నీలిమ చిరాగ్గా చూసింది వెళ్తోన్న వాహనం వంక. వెంటనే "ఏయ్... ఎవరో చూడవే" అంది అటవైపు చూపిస్తూ.

"ఎవరబ్బా?" అంటూ తలెత్తింది మలయజ.

"ఇందాకటి గెడ్డం సేల్స్‌బోయ్..."

"అవునే వెనకేవో పాకెట్స్..."

"వీధమ్మట తిరిగి అమ్ముకుంటున్నాడేమో?"

"అమ్ముకోడూ మరి. మనలాంటివాళ్లంతా షాపుకి వచ్చి టైంపాస్ బేరాలు చేస్తోంటే.." అంటూ పడీ పడీ నవ్వింది మలయజ.

శృతి కలిపింది నీలిమ.

"భలే పంచ్ ఇచ్చాం కదే! పాపం మాంచి గిరాకీ అనుకుని వుంటాడు" అంటూ.

ఇంతలో వీధి మలుపు వచ్చింది.

"ఓకే! నే వెళతానే. మా ఇల్లు వచ్చేసిందిగా" అంది మలయజ.

"బై" అంటూ ముందుకెళ్లింది నీలిమ.

మలయజ ఇల్లు ఓ పది అడుగుల దూరం వుందనగా అప్పుడెదురైంది ఇందాకటి లూనా.

వెళ్తూ పలకరింపుగా నవ్వాడా గెడ్డం సేల్స్‌బోయ్. తనూ నవ్వింది మర్యాద పూర్వకంగా. ఆమెకెందుకో అనుమానం వచ్చింది.

వడివడిగా లోపలికి పరుగెత్తి "మమ్మీ! ఓ గెడ్డం వ్యక్తిగానీ వచ్చాడా మనింటికి?" అనడిగింది వాళ్లమ్మని.

"ఇందాక ఆ షాప్‌లో ఏవో డ్రెస్‌లు సెలెక్ట్ చేసుకున్నావటగా! డబ్బుల్లేవని పక్కన పెట్టించావట. స్వయంగా తెచ్చిచ్చి డబ్బులు తీసుకుపోయాడు" చెబుతోందావిడ.

"ఆఁ...!" అంటూ నోరు తెరిచింది మలయజ.

"షాప్ ఓనర్ భలే రివర్స్ పంచ్ ఇచ్చాడు" అనుకుంది.

నీలిమకీ ఇదే పరిస్థితి ఎదురైందని వేరే చెప్పనక్కర్లేదనుకుంటా!

(20.6.2002)

*